KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...






Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 | సంచిక :121 | సోమవారం 31 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 | వెల: 3 రూ/-


# మంచి సంకల్పం, పరిపాలనతో ముందుకెళ్తున్నాం..

## ఉగాది వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టీ

మంచి సంకల్పం, పరిపాలనతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు హాజరయ్యారు భట్టీ. వేద పండితుల పంచాంగం విన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన భట్టీ.. ప్రజలందరూ ఉగాది పచ్చడి లాగా షడ్రుచులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.



2 లో

# హైదరాబాద్ మెట్రో రైలు టైమింగ్స్ మార్పు



2 లో

హైదరాబాద్ మెట్రో రైళ్ల రాకపోకల టైమింగ్స్ మారాయి. ట్రాఫిక్ నుంచి తప్పించుకునేందుకు సిటీవాసులు మెట్రోలో ఎక్కువగా జర్నీ చేస్తున్నారు. దీంతో మెట్రోలో రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా టైమింగ్స్‌లో మార్పులు-చేర్పులు చేసింది.

ఏప్రిల్ ఒకటి నుంచి టెర్మినల్ స్టేషన్‌ల నుంచి చివరి రైలు బయలు దేరే సమయాన్ని పొడిగించింది. ప్రస్తుతం టెర్మినల్ స్టేషన్ నుంచి చివరి రైలు రాత్రి 11 గంటలకు ఉండేది. ఏప్రిల్ 1 నుంచి 11. 45 నిమిషాలకు బయలుదేరనుంది.

# బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదో

## బండి సంజయ్ చెప్పాలి..

- కేంద్ర మంత్రి బండి సంజయ్ పై మంత్రి సీతక్క ఫైర్
- బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదో బండి సంజయ్ చెప్పాలి
- 2013లో ఆహార భద్రత చట్టాన్ని తెచ్చిందే కాంగ్రెస్



2 లో

# నక్సలిజాన్ని కాంగ్రెస్ ప్రోత్సహించింది.. ప్రధాని మోడీ



2 లో

ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహించిదని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ విధానాల వల్లే దశాబ్దాలుగా నక్సలిజం పెరిగిపోయిందన్నారు. ఆదివారం ఛత్తీస్ గఢ్‌లో పర్యటించిన మోడీ బిలాస్‌పూర్ జిల్లాలోని మోహభట్టా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంటుందని, త్వరలోనే అక్కడ నూతన శకం ప్రారంభమవుతుందని తెలిపారు. 'అభివృద్ధిలో ఏ ప్రాంతం వెనుకబడిందో, అక్కడ నక్సలిజం వృద్ధి చెందింది. కానీ 60 సంవత్సరాలు ప్రభుత్వాన్ని నడిపిన పార్టీ ఏమి చేసింది? అటువంటి జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి దాని బాధ్యత నుంచి తప్పుకుంది' అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద గిరిజనులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు.

# శ్రీమంతులు తినే బియ్యం ఇక పేదలు తింటారు : సీఎం రేవంత్



2 లో


- 'పేదల ఆకలి తీర్చే చారిత్రక పథకం' 'దొడ్డు బియ్యం మాఫియాకు చెక్' - తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ!
- తెలంగాణలో పీడీఎస్‌లో కొత్త మార్పులు!
- 'నల్లగొండ వీరుల గడ్డ' - సన్న బియ్యం పథకాన్ని ఉగాది రోజు ప్రారంభించిన సీఎం!

శ్రీమంతులు తినే బియ్యం ఇక పేదలు కూడా తింటారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హుజుర్ నగర్ లో సన్న బియ్యం పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

'దొడ్డు బియ్యం పంపిణీలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. పేదలకు కడుపు నిండా అన్నం పెట్టే పథకం ఇది. ఈ ప్రాంతం పోరాటానికి మారు పేరు. ఉగాది రోజున సన్నబియ్యం పథకం ప్రారంభించడం సంతోషంగా ఉంది. నల్లగొండ గడ్డపై నుంచి ఎంతో మంది ఎంపీలు గెలిచారు. ఈ ప్రాంతానికి మంచి చరిత్ర ఉంది. నల్లగొండ గడ్డ వీరుల గడ్డ.. పోరాటాలకు మారు పేరు. భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధపోరాటం జరిగింది. మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ ప్రాణాలకు తెగించి పోరాడారు' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

'25 లక్షల ఎకరాల భూమిని ఇందిరాగాంధీ పేదలకు పంచారు. పేదలకు తెల్ల బియ్యం తినాలనే రూపాయి 90 పైసలకే కేజీ బియ్యం ఇచ్చాం. పీడీఎస్ ను 70 ఏళ్ల క్రితమే కాంగ్రెస్ అమలు చేసింది. రెండు రూపాయలకు కిలో బియ్యం అన్న ఎన్టీఆర్ అమలు చేశారు. కాంగ్రెస్ ప్రారంభించిన పథకాన్ని ఎన్టీఆర్ కొనసాగించారు. దొడ్డు బియ్యం పేరిట ఏటా రూ.10వేల కోట్ల దోపిడి జరుగుతుంది. దొడ్డు బియ్యాన్ని ఇస్తే చాలా మంది అమ్మేస్తున్నారు. దేశంలో పేదల ఆకలి తీర్చిన తల్లి సోనియమ్మ. అర్హులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# నా జీవితం ప్రజలకే అంకితం: చంద్రబాబు



2 లో

- పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రపంచంలోనే ఆదర్శ రాజధానిగా అమరావతి
- 'పీ-4' కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు, పవన్

సమాజంలో మార్పు తెచ్చేందుకే పీ-4 విధానం తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగాది రోజున ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతమవుతుందని, అందుకే ఈ వినూత్న కార్యక్రమానికి ఇవాళ శ్రీకారం చుట్టామని తెలిపారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ' పీ-4' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్‌గా ఈ విధానాన్ని తీసుకొచ్చారు. తొలి దశలో దాదాపు 20 లక్షల మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు.

# ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్ కీలక ప్రకటన


రాష్ట్రంలో మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి యత్నిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఫ్యూచర్ సిటీ వల్ల లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక విషయాలు పంచుకున్నారు. " రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాం.

భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ షడ్రుచుల కలయికలా ఉంది. రాష్ట్రంలో ఆదాయన్ని పెంచి ప్రజలకు పంచాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. బడ్జెట్‌లో ఎక్కువగా నిధులు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకే కేటాయించాం.

2 లో

## నేటిమాట

"అవకాశాల మధ్య సమస్యలు కాదు, సమస్యల మధ్య అవకాశాలే దాగుంటాయి."



- అల్బర్ట్ ఐన్‌స్టీన్

# బీఆర్‌ఎస్ పాలనలో 'పింక్ వైరస్'.. కాంగ్రెస్ నేతలకు 'కరప్షన్ వైరస్'!

కేంద్ర మంత్రి బండిసంజయ్ ఉగాది సందర్భంగా తెలుగు ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ లోని తన నివాసంలో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ఆర్థిక ప్రగతిలో దూసుకుపోతోందని, ప్రధాని చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జ్యోతిష్య పండితుల ప్రకారం.. ఈ ఏడాది దొంగతనాలు పెరిగే అవకాశముందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడతారని, కొత్త వ్యాధులు ప్రబలే సూచనలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనను గమనిస్తే ఈ జ్యోతిష్య ఫలితాలు నిజమని అర్థమవుతోందని అన్నారు. కాంగ్రెస్ నేతలకు 'కరప్షన్ వైరస్' సోకిందని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల నుంచి పెండింగ్ బిల్లుల వరకు ప్రతి దాంట్లోనూ కమీషన్లు తీసుకోవడం సహజమైపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అవినీతి వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



2 లో

# ఆ పరిస్థితులు మారిపోయాయి.. లైట్ తీసుకోవద్దు

మన ఆచార సంప్రదాయాలను కాపాడుకోవాలని.. ముందు తరాలకు అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం నాడు సిద్దిపేట బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో శ్రీ విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సర ఉగాది ఉత్సవం పంచాంగ శ్రవణంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. విశ్వావసు నామ సంవత్సరం సిద్దిపేట, రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో క్షేమంగా ఉండాలని హరీశ్‌రావు అన్నారు.



2 లో

## శ్రీమంతులు తినే బియ్యం ఇక పేదలు తింటారు: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వం నాయకులు సన్నం బియ్యం పంపిణీ గురించి కనీసం ఆలోచన చేశారా..? దొడ్డు బియ్యం ప్రజలు తింటలేరు. మిల్లర్ల మాఫియాలోకి వెళ్తుంది. గత నాయకులు వరి వేస్తే ఉరి వేసుకున్నట్టే అని భయపెట్టారు. పేదలకు ఆహార భద్రత కోసమే ఈ స్కీం ను అమలులోకి తీసుకొస్తున్నాం. పేదల కోసమే ఆహార భద్రత చట్టాన్ని సోనియమ్మ తీసుకొచ్చారు. ఈ సన్న బియ్య పథకం చరిత్రలో నిలిచిపోతుంది. ఇది తెలంగాణ ప్రజల అదృష్టం. చరిత్రలో ఎవరు సీఎం అయినా ఈ స్కీం కొనసాగించాల్సిందే' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

దొడ్డు బియ్యాన్ని ప్రజలు కేజీకి రూ.10 చొప్పున అమ్ముకుంటున్నారు. మిల్లర్లు వాటిని కొని రీసైక్లింగ్ చేసి మళ్లీ రూ.50లకు అమ్ముకుంటున్నారు. పేద ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొని మిల్లర్లు రూ.కోట్లలో దందా చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగుపడడంతో రాష్ట్ర ప్రజలు సన్న బియ్యానికి మొగ్గు చూపుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రజల ఆకాంక్ష కోసం రేషన్ కార్డులపై సన్నబియ్యం పథకం అమలు చేయబోతున్నాం' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదో బండి సంజయ్ చెప్పాలి..

కేంద్ర మంత్రి బండి సంజయ్ పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 12 ఏళ్లలో సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు రాలేదో బండి సంజయ్ చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలో నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలన్న బండి సంజయ్ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని సీతక్క అన్నారు. 2013లో ఆహార భద్రత చట్టాన్ని తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని సీతక్క స్పష్టం చేశారు. బండి సంజయ్ కి గుర్తింపు సమస్య ఉంది. కాంగ్రెస్ పార్టీని తిడితే గుర్తింపు వస్తుందని బండి సంజయ్ ఆలోచన అని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని బీజేపీ చూస్తుంది. ప్రజలకు తినడానికి లేని రోజుల నుండి.. ఈరోజు సన్నబియ్యం ఇచ్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని సీతక్క వెల్లడించారు.

## నా జీవితం ప్రజలకే అంకితం: చంద్రబాబు

సమాజంలో మార్పు తెచ్చేందుకే పీ–4 విధానం తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగాది రోజున ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతమవుతుందని, అందుకే ఈ వినూత్న కార్యక్రమానికి ఇవాళ శ్రీకారం చుట్టామని తెలిపారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ' పీ–4' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్‌గా ఈ విధానాన్ని తీసుకొచ్చారు. తొలి దశలో దాదాపు 20 లక్షల మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. వెలగపూడిలోని సచివాలయానికి సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ' మార్గదర్శి– బంగారు కుటుంబం' నినాదంతో పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళగిరికి చెందిన నరసింహ కుటుంబాన్ని తొలి బంగారు కుటుంబంగా, భవన నిర్మాణ కార్మికుడు ఇమ్మాన్యుయెల్ కుటుంబాన్ని రెండో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి, డీబీవీ స్వామి, కూటమి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజలకే అంకితం: చంద్రబాబు

పేదరికం లేని సమాజం కోసమే కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. " నాకు ఏ కోరికలు లేవు. ప్రజలు, యువత భవిష్యత్తు బాగుండాలని ఆలోచించాను. సుపరిపాలనను, మంచి రాజకీయాలను నమ్మాను. నేను ఏ తప్పూ చేయలేదు.. భవిష్యత్‌లో చేయను. పని చేయడం తప్ప నాకు మరేమీ తెలియదు. 40 ఏళ్లుగా ప్రజలే జీవితంగా జీవించా. నా జీవితం ప్రజలకే అంకితం. పేదల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి..ఎన్టీఆర్. అన్ని విషయాల్లోనూ నాకు ఆయనే ఆదర్శం. ఆయన స్ఫూర్తితోనే 50 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్నా. పాతికేళ్ల క్రితం తెచ్చిన ఐటీ వల్ల తెలుగు యువత బాగుపడ్డారు. రైతు కూలీల పిల్లలు ఇవాళ అనేక దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. మేం చేసిన అభివృద్ధి వల్ల తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రజలకు ఏయే మంచి పనులు చేయాలనే నేను ప్రతిరోజూ ఆలోచిస్తా. ఇప్పుడు సాయం పొందిన వాళ్లలో అనేకమంది కోటీశ్వరులవుతారు.

ఫౌండేషన్ ద్వారా బిల్‌గేట్స్ అనేక సేవలు చేస్తున్నారు. విప్రో ప్రేమ్‌జీ, టాటాలు అనేక సేవలు అందిస్తున్నారు. వారెన్ బఫెట్ కూడా భారీ విరాళాలు ఇస్తూ అనేక సేవలు చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి చేస్తూనే ప్రతి పేద కుటుంబాన్నీ పైకి తీసుకొస్తా. ప్రపంచంలోనే ఆదర్శ రాజధానిగా అమరావతి అవుతుంది. వారెన్ బఫెట్ కూడా భారీ విరాళాలు ఇస్తూ అనేక సేవలు చేస్తున్నారు. గాడి తప్పిన పాలనను దారిలో పెట్టేందుకు కాస్త సమయం పడుతుంది. రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం అనేక పనులు చేస్తున్నాయి. అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, రైల్వే జోన్ సాధించాం. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, ఇవాళ సంపద సృష్టించే విధానాలు.

చాలా మంది ధనవంతులకు ఆస్తులు కాపాడుకోవడం కష్టమైన పనిగా మారింది. ఆస్తులు కాపాడుకునే ఒత్తిడిలో బీపీలు, షుగర్‌లు తెచ్చుకుంటున్నారు. సమాజానికి సేవ చేస్తేనే మీ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ప్రతి కుటుంబానికీ విజన్ డాక్యుమెంట్ తయారు చేద్దాం. పీ–4 విధానంలో ప్రభుత్వం మెంటార్‌గా ఉంటుంది. ప్రతి ఇంటికీ సౌకర్యాలు కల్పిస్తాం. సమాజం ఇచ్చినదాన్ని తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. పీ–4 విధానం సమాజంలో గేమ్ ఛేంజర్ అవుతుంది. 2047 నాటికి తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్‌వన్ కావాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

## తెలంగాణలో పోలీసుల అరాచకం

తెలంగాణలో ప్రభుత్వ అణచివేత, దమనకాండ విపరీతంగా పెరిగిపోయిందని బీఆర్‌ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వా మ్యం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ అంశంపై వెంటనే స్పందించాలని ఆదివారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ విధానాలను నిరసించే ప్రతి గొంతునూ బంధిస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను కూడా విచ్చలవిడిగా అరెస్టు చేస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. వందలాది ఎకరాల హెచ్‌సీయూ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సెంట్రల్ యూనివర్సిటీ లో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో పాటు జర్నలిస్టులను కూడా పోలీసు లు అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

తెలంగాణలో పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన హకును అణచివేస్తున్నారని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అరాచకాలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి పట్టణానికి వెళ్లి ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ గురించి రాహుల్ గాంధీ ఉపన్యాసాలు ఇస్తున్నారని, తెలంగాణలో సొంత పార్టీ పాలనలో జరుగుతున్న అరాచకత్వంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజాస్వామిక పాలన చేసేలా తమ పార్టీకి ఆదేశాలివ్వాలని రాహుల్ గాంధీకి సూచించారు. విద్యార్థులతోపాటు జర్నలిస్టును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్ కీలక ప్రకటన

రాష్ట్రంలో మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి యత్నిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఫ్యూచర్ సిటీ వల్ల లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక విషయాలు పంచుకున్నారు. " రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాం.

భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ షడ్రుచుల కలయికలా ఉంది. రాష్ట్రంలో ఆదాయన్ని పెంచి ప్రజలకు పంచాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. బడ్జెట్‌లో ఎక్కువగా నిధులు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకే కేటాయించాం. పెట్టుబడులు రావాలంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండాలి. దేశానికి తెలంగాణ ఆదర్శంగా ఉండేలా మారుస్తాం. మూసీ నదిని ప్రక్షాళన చేయడం, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ అనేది కేవలం ప్రజలు నివసించే నగరం కాదు.. పెట్టుబడుల నగరం కూడా. లక్షలాది మందికి ఉపాధి అందించేలా దీని నిర్మాణం జరుగుతుంది.

అభివృద్ధి జరిగేటప్పుడు కొన్ని అడ్డంకులు తప్పవు. ఏ విధానానికి 100కు 100 శాతం ఆమోదం లభించదు. ధనవంతుల లాగే పేదవారు సన్నబియ్యం తినాలని కోరుతున్నారు. 2024లో 1.56 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తిని సాధించేశాం. దేశంలో ఎక్కువగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత భారీగా వరి ఉత్పత్తి జరగలేదు. సన్న బియ్యం పండిస్తే బోనస్ కూడా అందిస్తున్నామని" సీఎం రేవంత్ అన్నారు.

## ఆ పరిస్థితులు మారిపోయాయి.. లైట్ తీసుకోవద్దు

మన ఆచార సంప్రదాయాలను కాపాడుకోవాలని.. ముందు తరాలకు అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తెలిపారు. ఆదివారం నాడు సిద్దిపేట బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో శ్రీ విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సర ఉగాది ఉత్సవం పంచాంగ శ్రవణంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడారు. విశ్వావసు నామ సంవత్సరం సిద్దిపేట, రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో క్షేమంగా ఉండాలని హరీష్‌రావు అన్నారు.

గతంలో పంచాంగ శ్రవణానికి చాలా ప్రాముఖ్యత ఉండేదని.. అది ఆధునిక ప్రపంచంలో క్రమంగా కోల్పోతుందని హరీష్‌రావు చెప్పారు. అందరూ యూట్యూబ్‌లోనే జాతకం చూసుకుంటున్నారని తెలిపారు. రానురాను పంచాంగ శ్రవణ ప్రాముఖ్యం తగ్గుతుందన్నారు. నేడు మన చేతిలో ఉన్న మొబైల్ మనల్ని ఏకాగ్రతగా ఉండనియడం లేదని చెప్పారు. ఎమ్మెల్యేగా సిద్దిపేటలో బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని, సీఎంగా దేశంలోనే మొట్ట మొదటి సారిగా బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌ది అని చెప్పారు. బ్రాహ్మణులు బాగుంటే దేవుడికి పూజాదికాలు బాగా అందుతాయన్నారు. సమాజం సుభిక్షంగా ఉంటుందని హరీష్‌రావు తెలిపారు.

దేవాలయ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీన ప్రభుత్వ ఖజానా నుంచి కేసీఆర్ జీతాలు అందించారని హరీష్‌రావు చెప్పారు. వేదాలను, దేవుడిని, బ్రాహ్మణులను గౌరవించే వ్యక్తి కేసీఆర్ అని చెప్పుకొచ్చారు. సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్తును ఒక ఆధ్యాత్మిక వేదికగా మార్చాలని అన్నారు. ప్రతి సమాజానికి ఆధ్యాత్మిక భావన ఎంతో ముఖ్యమని.. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు, పోలీసులు చేయలేని పనిని దేవుడిపై భక్తితో చేయగలుగుతామని అన్నారు. విదేశాల్లో మన సంస్కృతి సంప్రదాయాలను చక్కగా పాటిస్తే.. మనం మాత్రం లైట్ తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలను ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంత దగ్గర చేస్తే సమాజం అంత సుభిక్షంగా ఉంటుందని అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తున్నామని ప్రకటించారు. హిందూ ధర్మ పరిరక్షణను నిలబెట్టుకుంటూ, పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలను అందించాలని హరీష్‌రావు పేర్కొన్నారు.

## నక్సలిజాన్ని కాంగ్రెస్ ప్రోత్సహించింది.. ప్రధాని మోడీ

ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహించిదని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ విధానాల వల్లే దశాబ్దాలుగా నక్సలిజం పెరిగిపోయిందన్నారు. ఆదివారం ఛత్తీస్ గఢ్‌లో పర్యటించిన మోడీ బిలాస్‌పూర్ జిల్లాలోని మోహభట్టా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంటుందని, త్వరలోనే అక్కడ నూతన శకం ప్రారంభమవుతుందని తెలిపారు. 'అభివృద్ధిలో ఏ ప్రాంతం వెనుకబడిందో, అక్కడ నక్సలిజం వృద్ధి చెందింది. కానీ 60 సంవత్సరాలు ప్రభుత్వాన్ని నడిపిన పార్టీ ఏమి చేసింది? అటువంటి జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి దాని బాధ్యత నుంచి తప్పుకుంది' అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద గిరిజనులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో పరిస్థితి వేగంగా మారుతోందని నొక్కి చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ ప్రయత్నాల కారణంగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో శాంతియుతమైన కొత్త యుగం కనిపిస్తోందని తెలిపారు. బీజేపీ ప్రజలకు ఇళ్ళు నిర్మించడమే కాకుండా నివాసితుల జీవితాలను సుసంపన్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షలాది మందికి పక్కా ఇళ్లు కావాలనే కలలు కాగితాలకే పరిమితమయ్యాయని వివరించారు. కానీ తమ ప్రభుత్వం ఆ కలను నెరవేర్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చినందున ప్రజల్లో బీజేపీపై నమ్మకం పెరుగుతోందన్నారు.

## హైదరాబాద్ మెట్రో రైలు టైమింగ్స్ మార్పు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళలో మార్పులు జరిగినట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకు నడుస్తున్న మెట్రో రైలు సేవలు, ఏప్రిల్ ఒకటి నుంచి రాత్రి 11.45 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. మారిన టైమింగ్స్ సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే అమల్లో ఉంటా యన్నారు. టెర్మినల్ స్టేషన్ల నుంచి ఆదివారం మొదటి రైలు ఉదయం 7 గంటలకు మొదలుకానుంది.

విద్యార్థులకు మాత్రమే ఆఫర్

మరోవైపు గతేడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన సూపర్ సేవర్ హాలీడే ఆఫర్, ఆఫ్ పీక్ వేళల్లో స్మార్ట్ కార్డులపై ఇచ్చే తగ్గింపు మార్చి 31తో (ఈనెల చివరి) ముగియనుంది. అలాగే 20 ట్రిప్పులు మనీ చెల్లించి 30 ట్రిప్పులు పొందేందుకు వీలు కల్పించే విద్యార్థుల పాస్ ఆఫర్‌ను వచ్చే ఏడాది మార్చి వరకు అంటే మరో ఏడాది పొడిగించారు. దీనిపై హైదరాబాద్ మెట్రో నిర్ణయం తీసుకుంది.

ఇకపై రేటింగ్ ఇవ్వచ్చు

మరోవైపు T-Savaari పేరిట మొబైల్ అప్లికేషన్, హైదరాబాద్ మెట్రో ప్యాసింజర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు స్టార్ రేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించవచ్చు. అలాగే అభిప్రాయాలను చెప్పవచ్చు. ఈ యాప్ నుండి నేరుగా వినియోగదారులు QR టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి అనుమతిస్తుంది.

రియల్ టైమ్ పరిస్థితిని ప్రదర్శిస్తుంది. వాయిస్ ఇన్‌పుట్ ద్వారా వినియోగదారులు QR టిక్కెట్లను బుక్ చేసుకునేటప్పుడు స్టేషన్‌లను సులభంగా ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంది. బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. కొత్త రివార్డ్ సిస్టమ్ కూడా ప్రవేశపెట్టింది. వినియోగదారులు లాయల్టీ పాయింట్లను సంపాదించడానికి, రీడీమ్ చేయడానికి అనుమతిస్తుంది.

## పండగ వేళ కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం.. చెరువులో పడి తల్లి, ముగ్గురు పిల్లలు మృతి

ఉగాది పర్వదినాన కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో చెరువులో పడి తల్లి, ముగ్గురు పిల్లలు మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతులను మౌనిక (26), మైతిలి (10), అక్షర (8), వినయ్?గా గుర్తించారు.

కాగా, మృతులు బట్టలు ఉతకడానికి వెళ్లి చెరువులో పడి మరణించినట్లు తెలుస్తోంది. మొదట పిల్లలు చెరువులోకి స్నానానికి దిగి నీళ్లలో మునిగిపోగా.. వారిని కాపాడే ప్రయత్నంలో తల్లి కూడా నీట మునిగి మరణించినట్లు సమాచారం. చెరువులో నుంచి నలుగురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. నలుగురు నీళ్లలో మునిగి ఊపిరి ఆడకే చనిపోయారా..? లేదా మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.

పండగ పూట ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందటంతో వెంకటాపూర్ అగ్రహారంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే.. తల్లి, ముగ్గురు పిల్లల మృతిపై మౌనిక కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సమగ్రంగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మంచి సంకల్పం, పరిపాలనతో ముందుకెళ్తున్నాం.. ఉగాది వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టీ

మంచి సంకల్పం, పరిపాలనతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు హాజరయ్యారు భట్టీ. వేద పండితుల పంచాంగం విన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన భట్టీ.. ప్రజలందరూ ఉగాది పచ్చడి లాగా షడ్రుచులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్పీచ్:

పంచాంగంలో ఈ సంవత్సరం రాష్ట్రం అద్భుతంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాము. మంచి వర్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. మంచి పాలనతో, మంచి సంకల్పంతో రేవంత్ రెడ్డి, మంత్రివర్గంతో రాష్ట్రం ముందుకు వెళుతుంది.ప్రజలందరికీ అన్ని రకాలుగా వసతులు కల్పించే విధంగా, అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా, అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తున్నాం. అన్ని రంగాలు అభివృద్ధి చెందే విధంగా బడ్జెట్ తీసుకొచ్చాం. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్ నగర అభివృద్ధి, ట్రిబుల్ ఆర్ వంటి అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో 'పింక్ వైరస్'.. కాంగ్రెస్ నేతలకు 'కరప్షన్ వైరస్'!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో 'పింక్ వైరస్' సోకి ప్రజలు నష్టపోయారని సంజయ్ విమర్శించారు. బీజేపీ చేసిన పోరాటాల వల్ల తెలంగాణ ఈ పింక్ వైరస్ నుంచి విముక్తి పొందిందని పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీని స్వాగతించిన బండి సంజయ్, బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తోందని తెలిపారు. ఒక్క కిలో బియ్యం కోసం రూ. 40 మోడీ సర్కారే చెల్లిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 10 ఖర్చు చేస్తున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో అన్ని రేషన్ షాపుల్లో ప్రధాని మోడీ ఫోటోలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. శ్రవణ్ రావు సహా అందరికీ బెయిల్ వచ్చేలా కాంగ్రెస్ సహకరిస్తోందని అన్నారు. గత ఎన్నికల ముందు కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు.

జీహెచ్ఎంసీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మజ్లిస్‌ను గెలిపించేందుకు పోటీకి దూరంగా ఉంటున్నాయని అన్నారు. బీజేపీకి సరిపడా బలం లేకపోయినా పోటీ చేస్తామని చెప్పారు. ఆర్ఎస్ఎస్ దేశభక్తి కలిగిన సంస్థ అని, హిందూ సమాజాన్ని సంఘటితం చేయడమే ఆ సంస్థ లక్ష్యమని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ ఉగ్రవాదులకు అండగా నిలబడదని, కానీ మజ్లిస్ టెర్రరిస్టులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. మజ్లిస్ పార్టీకి తెలంగాణ అంతటా పోటీ చేసే దమ్మే లేదని విమర్శించారు. అధికారంలో ఉన్న ఏ పార్టీకి అయినా మజ్లిస్ మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటుందని, అది వారి వ్యాపార ధోరణిని కాపాడుకునేందుకు మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సవాల్ విసిరిన బండి సంజయ్, జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టి వేర్వేరుగా పోటీ చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలు వీరికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## మయన్మార్‌లో.. మృతదేహాల దుర్గంధం.. సన్నగిల్లుతున్న 'సజీవ' ఆశలు



మయన్మార్‌లో భూకంప విలయంలో మరణించిన వారి సంఖ్య 1700 దాటింది. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోగా.. వారిని రక్షించేందుకు పెద్దఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం వచ్చి రెండు రోజులు గడుస్తున్న నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి పరిస్థితిపై ఆందోళన కొనసాగుతోంది. తమవారు సజీవంగా ఉండొచ్చనే ఆశతో అనేకమంది తమ చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంకా అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు చేరలేదని సమాచారం. దీంతో మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని అంచనా. మరోవైపు.. మృతదేహాల దుర్గంధం మొత్తం వ్యాపిస్తున్నట్లు సమాచారం.

చేతులతోనే గాలింపు..

మయన్మార్‌లో 7.7 తీవ్రతతో వచ్చిన భూకంపం అనేక నగరాలపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా మాండలేలో భారీ భవనాలు, ఆధ్యాత్మిక, పర్యటక ప్రదేశాలతోపాటు అనేక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోవడం, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్న కారణంగా రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో భారీ పరికరాలు లేకుండానే రంగంలోకి దిగిన స్థానికులు.. ఉత్త చేతులతోనే శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వీధుల్లోనే నిద్ర..

రెండు రోజులుగా వరుస భూ ప్రకంపనలు మయన్మార్‌వాసులను హడలెత్తిస్తున్నాయి. వరుస ప్రకంపనల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందనే భయాలు స్థానికుల్లో నెలకొన్నాయి. దీంతో 15 లక్షల జనాభా ఉన్న మాండలేలో చాలావరకు ప్రజలు రాత్రి వేళల్లో వీధుల్లోనే నిద్రపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం రావడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు.

# ఘనంగా ఉగాది వేడుకలు

## విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు





**మోత్కూర్ 30మార్చ్ (క్రాంతి న్యూస్):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సంప్రదాయాలతో కూడిన ఈ ఉత్సవాల్లో మహిళలు, చిన్నారులు, యువతులు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణవ్యాప్తంగా ప్రత్యేక శోభ కనిపించింది. ఊరేగింపు ముందు శివసత్తుల ఆట, పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళలు, యువతులు డప్పుల శబ్దంతో ఊరేగింపుగా బయలుదేరి, గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. ఊరేగింపులో ఎడ్ల బండ్లు, ఆటోలు, డీసీఎంలు, కార్లు, ట్రాక్టర్లు ప్రత్యేక అలంకరణలతో దర్శనమిచ్చాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బోనాల ప్రదర్శన నిర్వహించగా, ప్రదక్షిణం చేసిన అనంతరం భక్తులు చెరువు కట్ట వద్ద కొలువై ఉన్న తూర్పు ముత్యాలమ్మ, సుందరయ్య కాలనీలోని పడమర ముత్యాలమ్మ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ముత్యాలమ్మ దేవతకు కోళ్ల బలి ఇస్తూ మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు వడి బియ్యం పోసి, పట్టు వస్త్రాలు సమర్పించారు. సంప్రదాయ బద్ధంగా సాగిన ఈ వేడుకల్లో ట్రాక్టర్, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువకులు బైక్ స్టంట్లతో పండుగ హుషారును మరింత పెంచారు. మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం గ్రామాల్లోనూ ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. అక్కడ కూడా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి నాగరాజు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి ఆలయంలో పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించి, భవిష్యఫలాలను వెల్లడించారు. ఉగాది పండుగ సందర్భంగా పట్టణం అంతటా భక్తి భావంతో కూడిన ఉత్సాహం నెలకొంది.

# స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాదించాలి



**రాయపర్తి,30మార్చ్(క్రాంతిన్యూస్):** స్వయం ఉపాధితో యువత ఆర్థిక ప్రగతి సాధించాలని ఎర్రబెల్లి వినిత్ రావు అన్నారు. నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశియ్ డ్రీమ్ ప్రాజెక్టు ఎగ్ కార్ట్స్ లో భాగంగా నెక్ వరంగల్ జోనల్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మండలం లోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన వేముల రమేష్ కు టిఫిన్ సెంటర్ ఏర్పాటు కు రూ. 70 వేల విలువైన మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వినిత్ రావు మాట్లాడుతు యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవేందర్,మాజీ సర్పంచ్ అనంత ప్రసాద్, పారుపల్లి యాదవ రెడ్డి,పుడమి రూరల్ డెవలప్మెంట్ సంస్థ కోశాధికారి వషపాక సుధాకర్, సునీల్, సాయిబాబా, దూకుడు సోమేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# అలంగిరి మస్జీద్ లో ఘనంగా ఇఫ్తార్ విందు



**రాయపర్తి,30మార్చ్(క్రాంతిన్యూస్):** రాయపర్తి, మండల కేంద్రంలోని అలంగిరి మస్జీద్ లో శనివారం సాయంత్రం కొత్త రాయపర్తి కి చెందిన కాంగ్రెస్ నాయకుడు గారె భిక్షపతి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రత్యేకమైన రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు ఉండడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అలంగిరి మస్జీద్ కమిటీ సదర్ అంజాద్ ఖాన్, నూర్ ఏ మస్జీద్ కమిటీ సదర్ ఎండి హుసేన్, ముస్లిం సోదరులు ఎండి నయీమ్, ఎండి గౌస్ ఖాన్, ఫెరోజ్, అఫ్రోజ్, ఎండి రఫీక్, ఇక్బాల్, రజాక్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గాలను సందర్శించిన రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్



రామగుండం, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఈద్గా ప్రదేశాన్ని అలాగే ఫోరింక్లైన్ సమీపంలోని ఈద్గాను సందర్శించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక నమాజులు చేసుకునేందుకు ముస్లిం మత పెద్దలకు వేదిక ఏర్పాట్లు, గ్రీన్ కార్పెట్లు, మంచినీటి సదుపాయాలు, ఎండ వేడిమి తట్టుకునేలా టెంట్లు వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రామగుండం బల్దియా ఆధ్వర్యంలో సకల సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ముస్లిం మత పెద్దలను ఆయన సంప్రదించారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు

# నిరుపేద యువతి - యువకుడి పెళ్లికి సమతా ఫౌండేషన్ చేయూత

**50 మంది కి పెళ్లి భోజనాలు ఏర్పాట్లు సమత ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్**



రామగుండం, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నప్పుడే మనుషుల మధ్య సమానత్వం ఏర్పడుతుందని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం రెండవ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు మహేష్(బీసీ) గోదావరిఖని గాంధీనగర్ కు చెందిన నిరుపేద యువతి రత్నకుమారి(ఎస్సీ) ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. వారి వివాహ వేడుకలకు సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ 50 మందికి పెళ్ళి భోజనాలు ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన వారి వివాహ రిసెప్షన్ వేడుకలకు దుర్గం నగేష్ తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి హాజరై నూతన దంపతులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పిల్లాపాపలతో, సుఖ సంతోషాలతో పదికాలాలపాటు చల్లగా వర్ధిల్లుతూ ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆశీర్వదించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పే బ్యాక్ టు ద సొసైటీ నినాదంతో సమతా ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు తమ వంతు సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. నేడు పెళ్లి చేసుకునే యువతి యువకుడు నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో పెళ్లి భోజనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో వారికి అండగా ఉంటూ ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తామని అన్నారు.

ప్రస్తుత సమాజంలో పెళ్లి అనేది ఆడంబరాలతో కూడుకున్న పరిస్థితి ఏర్పడిందని , ఇలాంటి తరుణంలో నిరుపేద కుటుంబాలు తమ బిడ్డలకు పెళ్లి చేయాలంటే చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. మరి రోజు పనికి వెళ్తే గాని గడవని కుటుంబాలు బిడ్డలకు పెళ్లి ఎలా చేయగలుగుతారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాలు తీర్చుకునేసరికె జీవితం సరిపోతుంది కాబట్టి మానవతావాదులు వారికి చేయూతగా మనలాంటి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలబడాలన్నారు. ఎంతోమంది ధనవంతులు గొప్ప గొప్ప వాళ్ళు వారు ఎంతో బిజీగా ఉండి ఇలాంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోలేకపోవచ్చు కానీ కూడా ఎంతో కొంత స్వచ్ఛంద సంస్థలకు తమ వంతు సహాయంగా అందిస్తే మరింత ఆసరాగా ఇలాంటి నిరుపేదలకు అండగా నిలిచే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న, రామగుండం ప్రెస్ క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, నంబయ్య, సమతా ఫౌండేషన్ సభ్యులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, చందనగిరి శివ ప్రసాద్, ఆత్రం హరీష్, గూడూరు లవన్ కుమార్, ఇందిరమ్మ కాలనీ మహిళలు, వధూవరుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక



కానుక రామగుండం, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రెండోవ డివిజన్ ఇందిరమ్మ కాలని,పికే రామయ్యా కాలనిలకు చెందిన 70 ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక ను అందజేసినట్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మడిపెల్లి మల్లేష్ తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ 29 రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేసి సోమవారం రోజున ఆనందంగా జరుపుకునే రంజాన్ పండుగ సందర్భంగా మా డివిజన్ ముస్లిం కుటుంబ సభ్యులకు నావంతుగా చిన్న కనుక అందజేయడం నాకు చాలా సంతోషంగా ఉందని గతంలో నేను రెండవ డివిజన్ లో కార్పొరేటర్ గా పోటీ చేసి ఓడిపోయిన మూడు నెలలకు కరోనా వచ్చిందని అదే సమయంలో రంజాన్ పండగ కూడా రావడం జరిగిందని కరోనా సమయంలో మా ముస్లిం కుటుంబ సభ్యులు పండగ జరుపుకోవడం ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకొని 2020 సంవత్సరమున నేను రంజాన్ కానుక అందజేశానని ఆరోజు నుండి ఇప్పటివరకు ఇచ్చిన మాట తప్పకుండా మా ముస్లిం కుటుంబాలకు నా తరుపున చిన్న కానుక అందిస్తున్నానని పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఈ కానుక అందించడం నా అదృష్టంగా భావిస్తున్నానని ప్రతి ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని మడిపెల్లి మల్లేష్ అన్నారు

# 46వ డివిజన్లో రంజాన్ తోఫా పంపిణీ



**ఖమ్మం,30 మార్చి (క్రాంతిన్యూస్ ):** స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లు ప్రతి ఏటా డివిజన్ పరిధిలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేస్తారు. అందులో భాగంగా 46వ డివిజన్ ముస్లిం కుటుంబాలకు కార్పొరేటర్ తయారు చేయించిన రంజాన్ తోఫాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం సంతోషదాయకమని తెలిపారు. అందరూ సోదర భావంతో మెలిగి పరోపకారం చేయాలని సూచించారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని వారు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రంజాన్ పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేసిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లను అభినందించారు. సమాజంలో అన్ని మతాలు సమానంగా అందరూ అన్ని పండుగలలో భాగస్వాములు కావడమే మన దేశ విశిష్టత అని తెలిపారు. కార్పొరేటర్ కన్నం వైష్ణవి మాట్లాడుతూ, ముస్లిం కుటుంబాలకు మాకు తోచిన సాయం అందిద్దామని సదుద్దేశంతో ఈ తోఫా పంపిణీ చేస్తున్నామని, ప్రజలందరూ సంతోషంగా ఉండేలా అల్లా దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆశ్రిఫ్,మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, నాయకులు కాటం కొమరయ్య, దేవర వెంకన్న, శనిగరం ఉప్పలయ్య, బాల్దే నాగేశ్వరరావు, కాటం యాదయ్య, అచ్చిని వెంకటేశ్వర్లు,గోనెల రవిశంకర్, చంద్రమ్మ, ఉపేంద్రమ్మ, గోనెల సునీత, చల్లా రమేష్, గోనెల రవిశంకర్, మీరా సాహెబ్, మీర్జా అజీజుల్లా బేగ్, మస్తాన్, కన్నం రమేష్,కేసోజు వీరాచారి, బుంగ శ్రీనివాస్, ఎరుకనబోయిన వెంకటేశ్వర్లు, షేక్ జానీమియా, పగిళ్ళ బుచ్చిబాబు,వేముల విజయ్, నజీర్, బొల్లక్క శ్రీను కెమిడీ యాదగిరి , గర్షకోటి కిషన్, మోటె జగదీష్, షేక్ మోయిన్, సెల్వం జ్ఞానేశ్వర్, భైరోజు సంతోష్, కర్రె వినోద్, కడగంచి అశోక్, సోమన బోయిన కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# చండీ హెూమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్,30మార్చి(క్రాంతిన్యూస్ ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ తాండాలోని జగదాంబదేవి ఆలయ ధర్మకర్త శ్రీశ్రీశ్రీ శంకర్ బావాలాల్ మహారాజ్ నిర్వహించిన చండీ హెూమమ్ మహెూత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతు శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అన్ని శు భాలు కలగాలని ఆశిస్తూ ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఉగాది సందర్భంగా మంత్రి స్టీల్ గ్లాసుల పంపిణీ



హుస్నాబాద్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): హుస్నాబాద్ పట్టణంలో హెూటల్ యజమానులకు స్టీల్ చాయ్ గ్లాసులు పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, డిపీవో దేవకీ దేవి పీఏసీ చైర్మన్ శివయ్య ఆర్డీవో మున్సిపల్కమిషనర్ ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హెూటలలో చాయ్ తాగినప్పుడు ప్లాస్టిక్ గ్లాస్ లో తాగడం ద్వారా అనారోగ్యాలకు గురవుతున్నాం అందుకే హుస్నాబాద్ పట్టణంలోనీ అన్ని హెూటల్ లకి స్టీల్ గ్లాసులు పంపిణీ చేయడం జరిగింది హుస్నాబాద్ నియోజవర్గం లో నియోజకవర్గంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకున్నారు ప్రతి హెూటల్ కి వంద గ్లాసుల చొప్పున ఇచ్చాంహుస్నాబాద్ టౌన్ లో యాభై హెూటల్ లు ఉన్నాయి హెూటల్ లలో స్టీల్ గ్లాసులు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి కి ఉపముఖ్యమంత్రి కి మంత్రులకు మట్టి కుండలు మట్టి పాత్రలు గ్లాసులు మట్టి జగ్ లు ఉగాది పచ్చడ కుండ ను శాలివాహన సంఘం సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. ఈరోజు రాష్ట్రం లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. చిన్న గ్రామాల్లో ఐదు వందల కిట్స్ పెద్ద గ్రామాల్లో వెయ్యి కిట్స్ తో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నాం ఎవరికి అవసరం ఉంటే వారికి ఇచ్చే విధంగా గ్రామాలకు ఇస్తున్నాం అవి ప్రతి గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ఇస్తాం. మెయింటెనెన్స్ చార్జెస్ తప్ప అదనంగా వస్సులు చేయము ప్లాస్టిక్ ను మన జీవితం నుండి దూరం చేయాలి ఉన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్

క్రాంతి
ఆంధ్రప్రదేశ్
epaper.krtvnews.com

# జిరాక్స్ షాప్ నడిపే వ్యక్తికి జీఎస్టీ నోటీస్

## -రూ.36 లక్షలు కట్టాలని నోటీస్ పంపారు
## -2008లో ఉద్యోగం చేసిన సమయంలో




ఓ వ్యక్తికి విచిత్రమై పరిస్థితి ఎదురైంది.. చిన్న జిరాక్స్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా.. ఊహించని పరిణామం ఎదురైంది. ఏకంగా రూ.36.13 లక్షలు జీఎస్టీ కట్టాలని నోటీసులు రావడంతో అందరూ అవాక్కయ్యారు. దీంతో షాక్ తిన్న ఆ వ్యక్తి అధికారులను కలిశాడు.. ఏం జరిగిందని ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది. లావేరు మండలం భరణికంకు చెందిన ఏ హరికృష్ణ వెంకటాపురంలో చిన్న జిరాక్స్ షాప్ నడుపుతున్నాడు. ఆయనకు ప్రకాశం జిల్లా ఒంగోలు జీఎస్టీ కార్యాలయం నుంచి ఒక నోటీసు వచ్చింది. అందులో 'మీరు ఒంగోలులో నడిపిన హనుమాన్ ట్రేడర్స్‌కు సంబంధించి రూ.36.19 లక్షల జీఎస్టీ బకాయిలు ఉన్నాయి. వెంటనే కట్టకపోతే మీ పేరు మీద ఉన్న 15 సెంట్ల స్థలాన్ని వేలం వేస్తాం" అని అందులో రాసి ఉంది. తన పేరు మీద ఒంగోలు నుంచి జీఎస్టీ అధికారులు నోటీసులు పంపడం ఏంటని అవాక్కయ్యారు హరికృష్ణ. వెంటనే ఆ నోటీసు తీసుకుని శ్రీకాకుళంలోని జీఎస్టీ కార్యాలయానికి వెళ్లి విషయం మొత్తం చెప్పాడు. అక్కడ అధికారులు ఆ నోటీసులు పరిశీలించారు.. పూర్తి వివరాలు చెక్చేశారు. అప్పుడు హరికృష్ణ పేరు మీద ప్రకాశం జిల్లా ఒంగోలులో 2018లో తుక్కు వ్యాపారం కోసం హనుమాన్ ట్రేడర్స్ పేరుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేశారని.. 2019లో దానిని మూసివేశారని గుర్తించారు.

తన పేరుతో ఒంగోలులో హనుమాన్ ట్రేడర్స్ పేరుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయడమేంటని హరికృష్ణ ఆలోచించాడు. అప్పుడు అసలు సంగతి తెలిసింది. హరికృష్ణ 2008 నుంచి 2015 వరకు ఒంగోలులోని ఒక బార్ అండ్ రెస్టారెంట్లో చిన్న ఉద్యోగం చేశాడు. అప్పుడు హరికృష్ణ నుంచి తీసుకున్న వివరాలతో వ్యాపార సంస్థను ఏర్పాటు చేసి.. పన్ను ఎగ్గొట్టారని అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని ఒంగోలు పన్నుల శాఖ అధికారులకు తెలియజేశామని.. విచారణ చేస్తున్నామని జిల్లా సహాయ కమిషనర్ రాణీమోహన్ తెలిపారు. హరికృష్ణను పాత వివరాలతో ఎవరో మోసం చేశారని.. దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఎప్పుడో 2008లో వివరాలు ఇవ్వడం తప్పైంది.. దానికి హరికృష్ణ బలయ్యారు.

# ఐఏఎస్, ఐపీఎస్‌ల సిఫారసు లేఖలు రద్దు!



క్రాంతిన్యూస్ : తిరుమలలో క్రమేణా భక్తుల రద్దీ పెరుగుతున్నది. ఉగాదితో పాటు వరుస సెలవులు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలి వెళ్తున్నారు. కాగా, వేసవిలో రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో టీటీ డీ కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సాధారణ భక్తులకు ప్రాధాన్యమిస్తూ వీఐపీ దర్శనాలను కుదించాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం బ్రేక్ దర్శనాల కారణంగా సాధారణ భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తున్నది.ఈ నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారం నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, స్థానిక అధికారులు, చిన్నచిన్న ప్రభుత్వ సంస్థల సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనా న్ని రద్దు చేయనున్నట్టు సమాచా రం. స్వయంగా వచ్చే అధికారులకు మాత్ర మే దర్శనం అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి టీటీడీ సమాచారం ఇచ్చినట్టు తెలుస్తున్నది.

# తిరుమలలో అపచారం..

## పవిత్రమైన కొండపై ఇలాంటి పనులా..?



క్రాంతిన్యూస్ : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల భక్తులకు అత్యంత పవిత్రమైన క్షేత్రం. కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాదు.. దేశవ్యాప్తంగా ఉన్న భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. తిరుమలేషుడు కేవలం దేశానికే పరిమితం కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు భక్తులున్నారు. ఎంతో భక్తితో ఏడు కొండలు ఎక్కి.. నిష్టగా దర్శనం చేసుకుని తరిస్తుంటారు భక్తులు. స్వామివారిని దర్శించుకుంటే చాలు కోరిన కోరికలు తీరుతాయన్న నమ్మకం. అంతటి పరిత్రమైన కొండపై కొంత మంది సిగ్గుమాలిన పనులు చేస్తుండటం భక్తులను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది.

తిరుమల కొండపై మద్యం, మాంసం, గుట్కా, సిగరెట్ లాంటివి పూర్తిగా నిషేధం. ఎప్పటి నుంచో ఈ ఆచారాన్ని భక్తులు పాటిస్తున్నారు. అయినప్పటికీ.. కొంతమంది దరిద్రులు.. కాసుల కోసం కక్కుర్తి పడుతూ స్వామివారి పవిత్రమైన ప్రాంతాన్ని మలినం చేస్తున్నారు. అక్రమ మార్గాల్లో మద్యం, మాంసాన్ని కొండపైకి తీసుకెళ్లి అచారాలను మంటగలుపుతున్నారు. ఇలాంటి అపచారాలు మళ్లీ మళ్లీ వెలుగులోకి వస్తునే ఉన్నాయి.

తాజాగా.. మరో అపచార ఘటన వెలుగులోకి వచ్చింది. ఈసారి అక్రమంగా తీసుకురావటం కాదు.. ఏకంగా దుకాణమే పెట్టేశాడు. శనివారం రోజున తిరుమలలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేయడంతో మళ్లీ కలకలం రేగింది. తిరుమలలోని బాలాజీ నగర్ ప్రాంతంలో.. రమేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మూడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రమేష్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

తిరుమల పవిత్రతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలూ అంగీకరించబోమని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. "తిరుమలలో మద్యం అక్రమ రవాణా, విక్రయాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నాము. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే తిరుమల కొండపైకి వెళ్లే ప్రతి భక్తుని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నప్పటికీ, కొందరు కేటుగాళ్లు కొత్త మార్గాలు వెతికి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పోలీసులు వెల్లడించారు.

ఈ ఘటనపై భక్తులు తీవ్రంగా స్పందిస్తున్నారు. తిరుమల వంటి పవిత్ర ప్రదేశంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరగడం తీవ్రంగా ఖండించదగిన విషయం అని భక్తులు చెప్తున్నారు. ఇలాంటి ఘటనలపై తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పోలీసు శాఖ కలిసి మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల పవిత్రతను భంగం కలిగించే వ్యక్తులను కఠినంగా శిక్షించాలంటున్నారు. తిరుమలలో భక్తులు నిశ్చింతగా పూజలు చేసుకునేలా పూర్తి భద్రత కల్పించాలని కోరుకుంటున్నారు. అయితే.. ఇదేదీ మొదటి ఘటన కాదని.. గతంలోనూ కొంతమంది కేటుగాళ్లు రహస్య మార్గాల్లో మద్యం, మాంసం తిరుమల కొండపైకి తరలిస్తూ పట్టుబడిన ఘటనలు చోటుచేసుకున్నాయని.. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తిరుమల కొండపైకి వెళ్లే అన్నిరకాల రవాణా మార్గాలను మరింత గట్టిగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని భక్తులు అంటున్నారు. ముఖ్యంగా నెలరోజుల వ్యవధిలో తిరుమలలో ఇటువంటి ఘటనలు పెరుగుతుండటంతో, భక్తులు భద్రతా చర్యలు మరింత కఠినతరం చేయాలని కోరుతున్నారు. "కలియుగ వైకుంఠం తిరుమల పవిత్రతకు భంగం కలిగించేవారిని అస్సలు వదలకూడదు!" అని భక్తులు ఒక్కటిగా డిమాండ్ చేస్తున్నారు. భక్తుల హితాన్ని దృష్టిలో పెట్టుకుని టీటీడీ , ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# విశాఖలో ఐసీసీ ఛైర్మన్, మంత్రి లోకేష్ సందడి..

## ఫుడ్‌కోర్టులో సామాన్యుల్లా, సిబ్బందితో సరదాగా



విశాఖపట్నంలో ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మంత్రి నారా లోకేష్, బీసీసీఐ పెద్దలు సందడి చేశారు. ఆదివారం విశాఖలోని ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ కేపిటల్స్–సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించారు. అంతకముందు విశాఖపట్నంలో ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మంత్రి నారా లోకేష్ ఈ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాదాపు రూ.35 కోట్లతో స్టేడియాన్ని ఆధునీకరిస్తున్నారు. విశాఖలోని ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఐపీఎల్ మ్యాచ్‌ల వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందని, త్వరలోనే పూర్తి చేస్తామని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మ్యాచ్‌లు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.


మ్యాచ్ అనంతరం మంత్రి లోకేష్, జైషా, రోజర్ బిన్నీ కలిసి ఫుడ్‌కోర్ట్‌లో సరదాగా గడిపారు. ఐపీఎల్ మ్యాచ్ ముగిసిన తర్వాత మంత్రి లోకేష్, ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ దగ్గరలోని ఫుడ్‌కోర్ట్‌కు వెళ్లారు. జైషా నగరంలో స్ట్రీట్ ఫుడ్ తినాలని కోరుకున్నారట. దీంతో మంత్రి లోకేష్ వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయంగా ఫుడ్‌కోర్ట్‌కు వెళ్దామని లోకేష్ చెప్పడంతో అధికారులు బీచ్ రోడ్డులోని రిసార్టులను ఎంపిక చేశారు. కానీ, దగ్గరలో ఏదైనా ఉందా అని మంత్రి అడగడంతో స్టేడియం ఎదురుగా ఎస్ఎఫ్‌సీ ఫుడ్‌కోర్ట్ ఉందని చెప్పారు. వెంటనే వారంతా అక్కడికి వెళ్లారు. సుమారు అరగంటకు పైగా అక్కడ ఉండి చాట్, పావ్‌బజ్జీ రుచి చూశారు. టీ కూడా తాగారు. ఆ తర్వాత ఫుడ్‌కోర్ట్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఫొటోలు దిగారు.

విశాఖపట్నం వచ్చిన మంత్రి నారా లోకేష్ ఆదివారం ఐపీఎల్ మ్యాచ్ చూశారు. ఆ తర్వాత రాత్రి 11 గంటలకు టీడీపీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బస్సులోనే రాత్రికి బస చేశారు.




# ఏపీకి మరో పెట్టుబడి..

## -ఆ జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్..
## -5వేల ఉద్యోగాలు, రైతులకు లాభాలు




క్రాంతిన్యూస్ : దేశంలో ప్రముఖ పాల ఉత్పత్తి సంస్థ మదర్ డెయిరీ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉంది. చిత్తూరు జిల్లాలోని కుప్పంలో రూ. 150–200 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. అలాగే, గుజరాత్‌లో కూడా రూ. 400 కోట్లతో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు మదర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ బాండ్లిష్ తెలిపారు. ఈ రెండు ప్లాంట్ల ద్వారా పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ చేయనున్నారు. కుప్పంలో ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక రైతులకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మదర్ డెయిరీ త్వరలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఒక ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్ కోసం రూ. 150 నుంచి 200 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. మదర్ డెయిరీ సఫల్ పేరుతో ఇప్పటికే చాలా చోట్ల పండ్లు, కూరగాయల రిటైల్ వ్యాపారం చేస్తోంది. రూ. 600 కోట్లతో రెండు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని మదర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ బాండ్లిష్ తెలిపారు. వీటిలో ఒకటి గుజరాత్‌లో, మరొకటి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటుందని.. గుజరాత్‌లోని బరోడా దగ్గర ఇటోలాలో రూ. 400 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇది రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని.. దీనికి బోర్డు కూడా ఆమోదం తెలిపింది అన్నారు. కుప్పంలో ప్లాంట్ కోసం భూమి కేటాయింపు జరగగానే పనులు మొదలు పెడతామని చెప్పారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల నివేదిక ఇంకా తయారు కాలేదన్నారు. ఢిల్లీ–ఎన్ సి ఆర్ మార్కెట్లో కొత్తగా విడుదల చేసిన ఇడ్లీ, దోశ పిండికి మంచి ఆదరణ లభిస్తోందని బాండ్లిష్ తెలిపారు. ప్రస్తుతం రోజుకు ఒక టన్ను పిండిని తయారు చేస్తున్నారు.

ప్రస్తుతం మదర్ డైరీ సఫల్‌కు బెంగళూరు, రాంచీ, ఢిల్లీలోని మంగోల్‌పురిలో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ మూడు ప్లాంట్లలో సంవత్సరానికి రెండు లక్షల టన్నుల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తున్నారు. పాల ఉత్పత్తుల కోసం న్యూ నాగ్‌పూర్‌లో రూ. 500 కోట్లతో కొత్త ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. ఇది 2026 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఈ మదర్ డెయిరీ సంస్థ ప్లాంట్ ఏర్పాటు కానుంది. మదర్ డెయిరీకి ప్లాంట్ కోసం కావలసిన భూమిని కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. శాంతిపురం మండలంలోని కర్లగట్ట పంచాయతీ పరిధిలో ప్రీతిచామనూరు దగ్గర ప్రభుత్వ భూమిని సిద్ధం చేశారు. దాదాపు 80 ఎకరాలను మదర్ డెయిరీకి ఇవ్వనున్నారు. ఈ ప్లాంట్ వల్ల దాదాపు 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని.. అలాగే కుప్పం ప్రాంతంలోని రైతులకు కూడా లాభం చేకూరుతుందని భావిస్తున్నారు.

# ఉగాది వేళ పేదలకు సాయంపై చంద్రబాబు కీలక నిర్ణయం..

## -సీఎంఆర్ఎఫ్ దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం
## -రూ.38 కోట్ల నిధులు విడుదలకు లైన్ క్లియర్
## -రాష్ట్రంలోని 3,456 మంది పేదలకు లబ్ది

క్రాంతిన్యూస్ : ఉగాది పర్వదినం రోజున రాష్ట్రంలోని పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నారు. నిరుపేదలకు సాయం అందించే రూ.38 కోట్ల సీఎం సహాయనిధి ఫైలుపై ముఖ్యమంత్రి సంతకం చేశారు. దీంతొ రాష్ట్రంలోని 3,456 మంది పేదలకు లబ్ధి చేకూరనుంది. తేడాది కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.281 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అనంతరం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని పేదరికం లేని సమాజాన్ని సాధిస్తే తన జన్మ ధన్యమవుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. అయినా ప్రభుత్వం రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. నాగరికత, సంస్కృతిని మరిచిపోతే మన ఉనికిని కోల్పోతామని సీఎం అన్నారు. ప్రపంచంలో భారత్, భారతీయులు అగ్రస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు.అప్పుడే తెలుగువారు నాయకత్వం వహించగలుగుతారని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అలాగే, సమాజం వల్ల కొందరు ఉన్నతంగా ఎదిగారని, వారు సమాజానికి కొంత తిరిగి ఇవ్వాలని సూచించారు.

అంతేకాదు, తాను 20 ఏళ్ల కిందట ఐటీ ప్రాధాన్యత గురించి చెప్పానని, అప్పుడు నా మాటలతో ఆ రంగం వైపు వెళ్లినవారు ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నారని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే సాధారణ వ్యక్తులూ ఉన్నతంగా ఎదుగుతారని తెలిపారు. ఆర్థిక




అసమానతలను తగ్గించేందుకు పీ 4 విధానం తీసుకొస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. దీనిపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, పథకాలను తొలగిస్తారని భయపెడుతున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రజలే ముందు అనే నినాదంతో తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటున్నామని సీఎం చెప్పారు.

భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎంతో పాటు పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమయంలో 116 మంది ఉగాది పురస్కారాలను సీఎం అందజేశారు.

# వేంసూరు మండలం కల్లూరు గూడెంలో నూతన ఆయిల్ పామ్ కర్మాగారానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల





**ఖమ్మం/వేంసూరు, 30,మార్చి (క్రాంతిన్యూస్ ):** వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లా రైతులు జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటు న్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

ఆదివారం వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టి.జి. ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిలతో కలిసి నూతన ఆయిల్ పామ్ కర్మాగార పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ప్రతి పనికి ఆటంకాలు ఎదురవుతాయని, ఆయిల్ ఫెడ్ నుంచి ఇచ్చే ఏ మొక్కలు కూడా కల్తీవి లేవని, నర్సరీ దశలోనే కల్తీ మొక్కలు కనిపెట్టడం జరుగుతుందని అన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సత్తుపల్లిలో అభివృద్ధి పనులు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టడం జరుగుతుందని అన్నారు.వేంసూరు మండలంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్టిఆర్ కాలువ పూర్తి చేశామని అన్నారు.రాజీవ్ లింక్ కాలువ పూర్తి చేసి వైరా నియోజకవర్గ పరిధిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందించామని అన్నారు.జూన్ నెలలోపు సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొని వస్తామని, నాగార్జున సాగర్ నిండకపోయినా గోదావరి నీటితో వేంసూరు మండల చెరువులు నింపు తామని అన్నారు.

వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతల పథకం నీటి సరఫరా చేసేందుకు పెండింగ్ పనులకు సవరించిన అంచనాలను సీఎం ఆమోదించారని అన్నారు.జాతీయ రహదారుల, ఆయిల్ పామ్ పంటల వృద్ధి ఖమ్మం జిల్లాను చూసి ఇతర జిల్లాలు నేర్చుకోవాలని అన్నారు. ఖమ్మం నుంచి 33 నిమిషాలలో సత్తుపల్లికి వచ్చేలా కల్లూరు, వేంసూరు జాతీయ రహదారి ఎగ్జిట్ ఏర్పాటు చేశామని, ఆగస్టు 15 నాటికి ఈ పనులు పూర్తి అవుతాయని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వ పథకాలు కొనసాగిస్తూ రైతుల ఖాతాలలో 33 వేల కోట్లను సీఎం రేవంత్ రెడ్డి జమ చేశారని అన్నారు. రైతు భరోసా భవిష్యత్తులో ఇచ్చిన హామీ మేరకు చేస్తామని అన్నారు. పంటల భీమా పథకం త్వరలోనే ప్రభుత్వం ప్రారంభిస్తుందని, ఎటువంటి కారణాలతో పంట నష్టపోయినా పరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు.

ఆయిల్ పామ్ పంటకు గిట్టుబాటు ధర 21 వేలు దాటే విధంగా అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు. హార్టికల్చర్ వ్యవసాయ సాగు వైపు రైతులు దృష్టి సారించాలని మంత్రి తెలిపారు.ఈ సంవత్సరం ఎక్కువ ఆయిల్ పామ్ పంట సాగు ప్రారంభమైందని, రాబోయే 10 సంవత్సరాలలో 20 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేయాలని మంత్రి తెలిపారు.ఆయిల్ పామ్ పంటకు కరువు, వరదలతో ఇబ్బందులు లేవని, 3 సంవత్సరాలలో పంట వచ్చే మొక్కలు అందిస్తున్నామని, రైతులు ఆలోచించి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, పంట సాగు పెరిగే కొద్దీ అవసరమైన ఫ్యాక్టరీలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీతో రైతులకు మంచి రేటు లభిస్తుందని, గతంలో కూడా ఈ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం కాకుండా కాపాడామని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు సైతం కనీస మద్దతు ధర ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వస్తామని అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ,రైతులకు లాభం జరగాలనే ఉద్దేశంతో ఆయిల్ పామ్ పంటను మంత్రి తుమ్మల ప్రోత్సహిస్తున్నారని అన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేంసూరు మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని,కల్లూరుగూడెం గ్రామంలో ఏర్పాటు చేసే ఫ్యాక్టరీ వచ్చే ఉగాది నాటికి పూర్తి అవుతుందని, నేరుగా 100 నుంచి 200 మంది యువతకు ఉపాధి లభిస్తుందని, పరోక్షంగా వేలాది రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అనేక రకాల సబ్సిడి అందిస్తుందని, 4 సంవత్సరాల కాలంలో దాదాపు 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం చెల్లిస్తుందని, తక్కువ నీటితో పంట పండుతుందని, ఎకరం పంటతో లక్షల రూపాయలు సంపాదించవచ్చని, మొదటి నాలుగు సంవత్సరాల పాటు అంతర్ పంటల సాగు చేయవచ్చని, రైతులంతా ఆలోచించి లాభసాటి ఆయిల్ పామ్ వైపు దృష్టి సారించాలని అన్నారు.

సీతారామ ప్రాజెక్టు క్రింద యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం చేయడంలో మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.గ్రీన్ ఫీల్డ్ హైవే దగ్గర మనకు ఉపయోగపడేలా 2 ఎగ్జిట్ లు ఏర్పాటు చేశామని అన్నారు. బుగ్గపాడులో ఫుడ్ పార్క్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలోనే అక్కడ కంపెనీల ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని అన్నారు.టి.జి.ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ఉగాది పర్వదినం సందర్భంగా 4వ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. గంటకు 15 నుంచి 60 మెట్రిక్ టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో 102 కోట్ల రూపాయల అంచనాతో అధునాతన ఆయిల్ పామ్ కర్మాగారం ఏర్పాటుకై ప్రణాళికలు రూపొందించామని, ఈ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసామని అన్నారు.ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 30 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుందని, సంవత్సరానికి 60 వేల మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ దిగుబడి వస్తుందని, ఇది భవిష్యత్తు రోజుల్లో లక్షా 50 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అన్నారు. అత్యున్నత టెక్నాలజీతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల మంచి దిగుబడి సాధ్యం అవుతుందని అన్నారు.మన రాష్ట్రంలో ఇప్పటి వరకు 65 వేల మంది రైతులను ఒప్పించి 2 లక్షల 50 వేల ఎకరాల సాగు ఆయిల్ పామ్ క్రింద తీసుకుని వచ్చామని అన్నారు. ప్రతి రైతుకు పొలం దగ్గర నుంచే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కంపెనీలు పంట కొనుగోలు చేసేందుకు చట్టబద్ధత కల్పించామని, 3 రోజులలో డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల అధికారులు, తెలంగాణ, ఆంధ్రా ఆయిల్ పామ్ అధ్యక్షులు, ప్యాక్స్ డైరెక్టర్ లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం
## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంశ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్ రెడ్డి నగర్ లోని శ్రీ మారుతి సాయి ఉమా సంగమేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మాట్లాడుతూ. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని భావించి కాలనీవాసులంతా కలిసి ఈ కళ్యాణ మండప నిర్మాణానికి సహాయం చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. అనంతరం ఉగాది పర్వదినాన కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ని ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, హలో జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు పప్పిరెడ్డి సురేందర్ రెడ్డి, రమణారెడ్డి, రమేష్, సత్యనారాయణ, అజయ్, శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గసభ్యులు సుధాకర్ రెడ్డి, జేబీ శర్మ, వెంకటేశ్వరరావు, వెంకటయ్య, నారాయణరావు, మోహన్ రావు, అప్పలనాయుడు, రోహిత్ రెడ్డి, దుర్గారెడ్డి, కృష్ణమూర్తి, భగీరథ రెడ్డి, నమో నారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగర క్రైస్తవులు ఫెలోషిప్ ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణానికి శాంతి చేకూరాలని క్యాండిల్ లతో నిరసన.




ఖమ్మం, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుండి ఎస్.ఆర్ అండ్ బి.జి.ఎన్.ఆర్ వరకు ఖమ్మం నగర క్రైస్తవులు ఫెలోషిప్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం కై శాంతియుత ర్యాలీ యస్.ఆర్ అండ్ బి.జి.యన్.ఆర్ డిగ్రీ కాలేజి గ్రౌండ్ లో క్రొవొత్తుల తో ఘననివాళులతో ముగిసింది.ఈ ర్యాలీలో పాల్గొన్న దేవుని సేవకులు జకర్యా హన్మంతరావు, చల్లగుండ్ల రమేష్ బాబు, ఆనంద్, విజయ్ కుమార్ , యం.యస్ డేవిడ్, మాచర్ల శేఖర్ బాబు, తిమోతి, వేముల సత్యం , నెలాల బాలస్వామి, కృష్ణమోహన్, సంజీవరావు ,ఫీటర్, ఫీటర్ విజయ్ , యం.యస్ చిన్ని డేవిడ్, పి రవికిరణ్ , సురేష్ ,యం.రాజు, వేణు మోజెస్ లు మాట్లాడుతూ,పాస్టర్ ప్రవీణ్ మరణం పలు అనుమానాలకు తావిస్తోంది కావున రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోమ్ మంత్రి, డిజిపి పోలీస్ యంత్రాంగం తగు విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించి ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ శాంతియుత ర్యాలీలో సుమారు రెండు వేల మంది సేవకులు, క్రైస్తవులు, జ్యోతి, సుశీల, సేవకులు సైమన్, రాము, అభిషేక్, అశోక్, యోహాను, కిషోర్, పౌలు, మోషే , సామెల్, నెహేమ్యా, బాలస్వామి, సామ్యూల్, తిమొంతి గోస్పెల్, క్రిష్ణ పాల్గొన్నారు .

## ఉగాది సందర్భంగా శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు.



ఖమ్మం, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): ఉగాది పర్వదినాన ప్రభాత్ టాకీస్ రోడ్డు రామాలయం ఎదురుగా గల శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకము, సహస్ర నాగవల్లి దళార్చన , విశేష పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,ఈ విశేష పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తాంజనేయ స్వామి వారిని సేవించి తీర్థప్రసాదాన్ని తీసుకొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారని దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు హరీష్ శర్మ తెలిపారు .

ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో, ఆనందోత్సవంగా ఈ సంవత్సరం అంతా కొత్త కాంతులతో విరజిల్లాలని ఆకాంక్షిస్తూ భక్త యావత్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు' నామ సంవత్సరం అనగా ఇది విశ్వంవసు అనే 2 పదాల కలయిక. 'విశ్వం వాసయతి' అంటే విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు భగవంతుడు అని అర్థం.ఈ పేరు మహావిష్ణువుకూ వర్తిస్తుందని, శుభకారకుడైన శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరిలో సంతోషాన్ని, ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు వసంత కుమార్ పంతంగి అశోక్, దేవ దత్తు, వంశీకృష్ణ, అనిల్ కుమార్, వాత్సల్య హాస్పిటల్ డాక్టర్ రాజ్ కుమార్ లు పాల్గొన్నారు .

## ఉగాది పర్వదినం సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి ని మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన డివిజన్ అధ్యక్షుడు సోమన్న గారి శ్రీధర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్,30 మార్చి (క్రాంతిన్యూస్ ):** కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్130 డివిజన్ అధ్యక్షుడు సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, వారి బృందం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకుల మధ్య సౌహార్దపూర్వక చర్చలు జరుగగా, నూతన సంవత్సర లో కొత్త ఆలోచనలు, సంకల్పాలతో ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేసిన - పజిల్ బక్షి

చంద్రుగొండ, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): బెండాలపాడు పంచాయతీలో యువ క్రీడాకారులు కోరిక మేరకు వాలీబాల్ మరియు నెట్ అందజేసిన అశ్వరావుపేట నియోజకవర్గం సేవాదల్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్షి. ఈ సందర్భంగా



ఫజల్ భక్షి మాట్లాడుతూ....క్రీడలు ఆరోగ్యానికి మానసిక ఆనందానికి దోహదపడతాయని, అదేవిధంగా భవిష్యత్తులో ఉద్యోగాల ఎంపికలో కూడా ప్రధాన భూమిక వహిస్తాయని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కారం చిట్టిబాబు, ఉపాధ్యక్షులు సపోవట్ రాజేష్, ప్రధాన కార్యదర్శి ఓర్సు రామకృష్ణ, మాజీ సర్పంచ్ వీసం రాములు, యువ నాయకులు పోట్టా రాము, బోడ శ్రీను, ఆంగోత్ రమేష్ ,ఆంగోతు కిషన్, రాయల నరేష్, గోగుల తిరుమలరావు, అయోధ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి, కృతజ్ఞతలు తెలియజేసినారు.

## ఈ ఆహారాలు కొందరికి అసలు జీర్ణం కావు..

### వీటికి దూరంగా ఉండడమే మంచిది..

హెల్త్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): రోజూ మనం రకరకాల ఆహారాలను తింటుంటాం. వెజిటేరియన్లు శాకాహారాలలో వివిధ రకాల వెరైటీ రుచులను ఆస్వాదిస్తారు. నాన్ వెజ్ ప్రియులు కూడా తరచూ పలు రకాల మాంసాహారాలను తింటుంటారు. ఇవే కాకుండా ఇంటా బయటా చిరు తిళ్లను, పండ్లను, ఇతర ఆహారాలను కూడా మనం తింటుంటాం. అయితే ఏ ఆహారాన్ని తిన్నా కూడా అది జీర్ణం అయ్యేందుకు కాస్త సమయం పడుతుంది. అందుకనే సులభంగా జీర్ణం అయ్యే ఆహారాలనే తినాలని వైద్యులు చెబుతుంటారు. అలాగే అతిగా ఆహారాన్ని తినకూడదని కూడా సూచిస్తుంటారు. ఇక కొందరు కొన్ని రకాల ఆహారాలను మరీ అతిగా తింటారు. దీంతో అవి సరిగ్గా జీర్ణం కాక ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలోనే ఏయే ఆహారాలను తింటే అవి సరిగ్గా జీర్ణం కావు.. వాటితో ఎలాంటి సమస్యలు వస్తాయి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**వేయించిన పదార్థాలు..**

బాగా వేయించిన ఆహారాలను ఎప్పుడో ఒకసారి తింటే ఫర్వాలేదు. కానీ తరచూ తింటే మాత్రం అజీర్తిని కలగజేస్తాయి. వేయించిన ఆహారాలు సరిగ్గా జీర్ణం కావు. వీటిని అతిగా తింటే అంతే సంగతులు. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. వేయించిన ఆహారాల్లో నూనె అధికంగా ఉంటుంది. కనుకనే ఈ ఆహారాలు అంత సులభంగా జీర్ణం కావు. కొందరు బయట మిర్చి బజ్జీలు, పునుగులు వంటి ఆహారాలను తరచూ తింటుంటారు. ఇవి సరిగ్గా జీర్ణం కావ. తరచూ వీటిని తింటే అజీర్తి ఏర్పడి అది మలబద్దకానికి దారి తీస్తుంది. దీంతో పైల్స్ కూడా ఇబ్బంది పెడతాయి. కాబట్టి ఈ ఆహారాలను తరచూ తినకూడదు. ఇవి జీర్ణక్రియకు హాని చేస్తాయి.

**కారం, మసాలాలు..**

కొందరు మసాలా ఆహారాలు అన్నా, కారం ఉండే ఆహారాలు అన్నా ఇష్టంగా తింటారు. వీటిని కూడా ఎప్పుడో ఒకసారి తింటే ఓకే. కానీ తరచూ తింటే మాత్రం సమస్యలను కలగజేస్తాయి. మసాలా, కారం ఆహారాల్లో



యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక ఈ ఆహారాలను తింటే మేలే జరుగుతుంది. కానీ వీటిని అధికంగా తింటే మాత్రం ఇబ్బందులు తప్పవు. ఇవి కూడా సరిగ్గా జీర్ణం కావు. కడుపులో మంట, గ్యాస్‌ను కలగజేస్తాయి. ఇక కొందరికి పాలు పడవు. పాల ఉత్పత్తులను తీసుకున్నా కూడా సరిగ్గా జీర్ణం కావు. పాలలో లాక్టోస్ అనే పదార్థం ఉంటుంది. ఇది ఒక రకమైన చక్కెర. కొందరికి లాక్టోస్ ఉండే పాల వంటి ఆహారాలను తింటే అలర్జీలు వస్తాయి. ఇంకా కొందరికి ఈ ఆహారాలు పడక అజీర్తి సంభవిస్తుంది. కనుక ఈ పదార్థాలు పడని వారు కూడా దూరంగా ఉంటే మంచిది.

**ఆకుకూరలు..**

ఆకుకూరలను తరచూ తినడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ జీర్ణ క్రియను మెరుగు పరుస్తుంది. అయితే కొందరికి ఆకుకూరలు పడవు. వీటిని తింటే జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాంటి వారు కూడా వీటికి దూరంగా ఉండాలి. పప్పు దినుసులు, రాజ్మా, బీన్స్, గింజలు వంటి ఆహారాలు కొందరికి జీర్ణం కావు. జీర్ణం అయ్యేందుకు చాలా సమయం పడుతుంది. అలాగే నిమ్మ జాతికి చెందిన సిట్రస్ ఫలాలు కొందరికి అజీర్తిని కలగజేస్తాయి. నిమ్మ, నారింజ, బత్తాయి వంటి పండ్లు సరిగ్గా జీర్ణం కాని వారు కూడా ఉంటారు. వారు కూడా ఈ పండ్లను తినకూడదు. ఇలా కొన్ని ఆహారాలు కొందరిలో జీర్ణ సమస్యలను కలగజేసే అవకాశాలు ఉన్నాయి. కనుక ఆయా ఆహారాలను వారు తినకపోవడమే మంచిది

## రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తగ్గితే?



హెల్త్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ):రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి అవసరమైనంత మోతాదులో వుండాలి. అలా లేకపోతే ఏమవుతుందో తెలుసుకుందాము.హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకువెళు తుంది.అందువల్ల, హిమోగ్లోబిన్ తగ్గితే, మీరు అలసిపోయినట్లు భావిస్తారు.తగినంత ఆక్సిజన్ లేకపోవడం వల్ల మీకు ఊపిరి తీసుకోవడం కష్టంగా అనిపించవచ్చు.రక్త ప్రసరణ తగ్గడం వల్ల ముఖం పాలిపోయినట్లు కనిపిస్తుంది.  తల తిరుగుతున్నట్లు అనిపించవచ్చు.శరీర ఉష్ణోగ్రత తగ్గడం వల్ల చేతులు, కాళ్ళు చల్లగా మారుతాయి. ఛాతీ నొప్పిగా అనిపిస్తుంది.

## ప్రొటీన్ లోపంతో ఇబ్బంది పడుతున్నారా?

హెల్త్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): ప్రోటీన్ మన శరీరానికి చాలా అవసరం. మనం రోజూ తినే ఆహారంలో శరీరానికి కావలసినంత ప్రోటీన్ ఉండటం చాలా ముఖ్యం. కానీ చాలా మంది రోజువారి ప్రోటీన్ తీసుకోవడం గురించి గందరగోళంలో ఉంటారు. దీనివల్ల ప్రోటీన్ లోపంతో ఇబ్బంది పడతారు. ప్రొటీన్ లోపం వల్ల బలహీనత, అలసటతో పాటు జుట్టు రాలడం, చర్మం పొడిబారడం వంటి సమస్యలు ఏర్పడతాయి. కండరాల బలహీనత పెరిగి నీరసం వంటి లక్షణాలు తరచూ కనిపిస్తాయి. ప్రొటీన్ లోపం రోగనిరోధశక శక్తిని కూడా తగ్గించి అనారోగ్యాన్ని కలిగిస్తుంది. శరీరంలో ముఖ్యంగా కళ్లు, చేతులు వంటి ముఖం వంటి భాగాల్లో వాపు వస్తుంది. వీటన్నింటిని నుంచీ తప్పంచుకోవాలంటే ప్రోటీన్ లోపాన్ని తగ్గించుకోవాలి. ఇందుకోసం సప్లిమెంట్లకు బదులుగా ప్రొటీన్లతో నిండిన ఆహారాలను తరచూ తినడం మంచిది. ప్రొటీన్ లోపాన్ని తగ్గించుకోవడానికి చాలా రకాల ఆహార పదార్థాలున్నప్పటికీ ముఖ్యంగా 3 రకాల ఆహారాలు మీకు చాలా బాగా సహాయపడతాయి. అందుకే పోషకాహార నిపుణులు 3 ఆహార పదార్థాలను సూచించారు. ఇవి సులభంగా రోజువారి ప్రోటీన్ అవసరాన్ని తీరుస్తాయి, మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**శరీరానికి ఎంత ప్రోటీన్ అవసరం?**

శరీరానికి కావలసిన ప్రోటీన్ వయస్సు, శారీరక కార్యకలాపాలు, లింగం ఆధారంగా మారుతుంది. ఉదాహరణకు, స్త్రీలకు, పురుషులకు ప్రోటీన్ అవసరం వేరు వేరుగా ఉంటుంది. అలాగే, చురుకుగా ఉండే, నిష్క్రియాత్మక జీవనశైలి ఉన్నవారికి ప్రోటీన్ అవసరం వేరు వేరుగా ఉంటుంది. కానీ సాధారణంగా, పురుషులకు శరీర బరువుకు కిలోగ్రాముకు 0.84 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుంది. అలాగే స్త్రీలకు 0.75 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుంది.

**ప్రొటీన్ అవసరాన్ని తీర్చే సింపుల్ ఫుడ్స్ ఏంటి?**

**1. గ్రీక్ యోగర్ట్:**

చాలా మంది పెరుగును రోజూ తప్పనిసరిగా తింటారు. పెరుగులో ప్రొటీన్లు చాలా ఉంటాయి. కానీ పోషకాహార నిపుణులు



శాలిని సుధాకర్ ప్రకారం.. పెరుగు కన్నా గ్రీక్ యోగర్ట్ లో ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. రోజు పెరుగుకు బదులుగా గ్రీక్ యోగర్ట్ తిన్నారంటే దాదాపు 12 గ్రాముల ప్రోటీన్ అందుతుంది. ఇది రోజువారి ప్రోటీన్ లక్ష్యాన్ని సులభంగా పూర్తిస్తుంది.

**2. రొట్టెలో సోయా పిండి కలపండి**

గోధుమ పిండి రొట్టెలను తింటూనే ప్రోటీన్ అవసరాన్ని తీర్చుకోవాలి అనుకుంటున్నారా? అయితే దాంట్లో సోయాబీన్ పిండి కలపండి. దీనివల్ల రొట్టె ప్రోటీన్ రిచ్ ఆహారంగా మారుతుంది. గోధుమపిండిలో సోయా పిండి కలిపి తయారు చేయడం వల్ల ఒక రొట్టెలో దాదాపు 10 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. సాధారణ రొట్టెలో కేవలం 3 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది.

**3. చియా సీడ్స్**

రోజుకు 2-3 లీటర్ల నీరు తాగుతారు కదా? అయితే దాంట్లో రెండు గ్లాసుల నీటిలో కొంత చియా సీడ్స్ నానబెట్టి తాగండి. ఇది మీ రోజువారి ప్రోటీన్ అవసరాన్ని తీరుస్తుంది. చియా సీడ్స్ నీటిలో కలిపి తాగితే దాదాపు 10 గ్రాముల ప్రోటీన్ శరీరానికి లభిస్తుంది. అలాగే ఫైబర్ లోపం కూడా తీరుతుంది. ఇది శరీర ఆరోగ్యకరమైన పనితీరుకు అవసరం.

## వేసవి ఎండల్లో ఈ 9 పండ్ల రసాలు తాగితే?



హెల్త్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ):మండే ఎండల్లో మీ మనసును, శరీరాన్ని చల్లబరచడానికి పండ్ల రసాలు తాగుతుండాలి. వేడి వాతావరణంలో నిర్జలీకరణాన్ని నివారించే పండ్ల రసాలు ఏమిటో తెలుసుకుందాము. నిమ్మరసం చర్మాన్ని శు భ్రపరచడానికి, డీహైడ్రేషన్ కాకుండా వుంచటానికి మేలు చేస్తుంది. అధిక కేలరీలు కలిగిన పుచ్చకాయ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది.విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే మామిడి రసం వేసవిలో అనువైనది.  నారింజ పండు గుండెకు మంచి వేసవి రసం.వేసవికి బొప్పాయి రసం చాలా మంచిది.ద్రాక్ష రసం కూడా ఎక్కువ హైడ్రేటింగ్ కలిగి ఉంటుంది.గూస్బెర్రీస్ దాదాపు 87% నీటిని కలిగి ఉంటుంది.

## ముంబయి ఇండియన్ కెప్టెన్ హార్ధిక్ పాండ్యాకు షాక్..!

స్పోర్ట్స్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు స్లో ఓవర్ రేట్ కారణంగా రూ.12లక్షల జరిమానా విధించారు. శనివారం నరేంద్ర మోదీ స్టేడియంలో టైటాన్స్ చేతిలో ముంబయి ఇండియన్ 36 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో హార్దిక్ ఆడిన తొలి మ్యాచ్ ఇదే. స్లో ఓవర్ రేట్



కారణంగా గత సీజన్ చివరి మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా హార్దిక్‌కు ఒక మ్యాచ్‌లో ఆడకుండా నిషేధం విధించిన విషయం తెలిసిందే. దాంతో ఈ ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో ముంబయి బరిలోకి దిగి.. సీఎస్‌కే చేతిలో పరాజయం పాలైంది. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌కు పాండ్యా మళ్లీ జట్టుతో చేరి బాధ్యతలు తీసుకున్నాడు. ఇదిలా ఉండగా.. సీజన్‌కు ముందు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కెప్టెన్లతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఒక మ్యాచ్ బ్యాన్‌ను నిషేధించారు. కెప్టెన్లకు డీమెరిట్ పాయింట్లతో పాటు స్లో ఓవర్ రేట్‌కు కేవలం జరిమానా మాత్రమే విధించేందుకు అంగీకారం కుదిరింది. తాజా మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం జరిమానా విధించారు. గుజరాత్-ముంబయి మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ మొదట నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగులు చేసింది. ఆ తర్వాత 197 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబయి ఆరు వికెట్ల నష్టానికి 20 ఓవర్లలో కేవలం 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. సాయి సుదర్శన్ అర్ధ సెంచరీ, బౌలర్ల అద్భుతమైన ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్‌ను 36 పరుగుల తేడాతో ఓడించింది. ఈ సీజన్‌లో గుజరాత్‌కు ఇదే తొలి విజయం. రెండు మ్యాచ్‌ల్లో ముంబయికి ఇది రెండో ఓటమి.

## సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్..

స్పోర్ట్స్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ):ఐపీఎల్-2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో ఓటమి చవిచూసింది. వైజాగ్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ పరాజయం పాలైంది. 164 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఢిల్లీ బ్యాటర్లలో ఫాఫ్ డుప్లెసిస్(50) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. జాక్ ఫ్రెజర్ మెక్‌గర్క్(38), అభిషేక్ పోరెల్(34) రాణించారు.



ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో జీషన్ అన్సారీ ఒక్కడే మూడు వికెట్లు పడగొట్టాడు. మిగితా బౌలర్లందరూ దారుణంగా విఫలమయ్యారు. స్టార్ పేసర్ మహ్మద్ షమీ మరోసారి తేలిపోయాడు. తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. మూడు ఓవర్లు బౌలింగ్ చేసిన షమీ.. వికెట్ ఏమీ తీయకుండా 31 పరుగులు సమర్పించుకున్నాడు.

ఐదేసిన స్టార్క్..

ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లోనూ ఎస్ఆర్‌హెచ్ తేలిపోయింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో అనికేత్ వర్మ(74) టాప్ స్కోరర్‌గా నిలవగా.. క్లాసెన్(32), హెడ్(22) పరుగులతో రాణించారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ ఐదు వికెట్లతో చెలరేగాడు. అతడితో పాటు కుల్దీప్ యాదవ్ మూడు, మొహిత్ శర్మ ఒక్క వికెట్ సాధించారు.

## శరత్ కమల్ శకం ముగిసె...

స్పోర్ట్స్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ):భారత టేబుల్ టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ తన ఆట ముగించాడు. వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో పరాజయంతో అతను రిటైర్ అయ్యాడు. ఈ టోర్నీ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో సూరావజ్జుల స్నేహిత్ (తెలంగాణ) చేతిలో శరత్ కమల్ 0-3తో ఓటమిపాలయ్యాడు. 25 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో స్నేహిత్ 11-9, 11-8, 11-9తో విజయం సాధించాడు.



శరత్ కమల్ చివరి మ్యాచ్ చూడటం కోసం నెహ్రూ స్టేడియానికి పెద్ద సంఖ్యలో అభిమానులు వచ్చారు. మ్యాచ్ ముగిసిన తర్వాత వారందరికీ అభివాదం చేస్తూ అతను కృతజ్ఞతలు తెలిపాడు. అంతకు ముందే పురుషుల డబుల్స్ విభాగంలో స్నేహిత్‌తోనే కలిసి శరత్ డబుల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఈ పోరులో కొరియా జోడి లిమ్ జొంగూన్ - ఆన్ జేహూన్ చేతిలో 11-9, 8-11, 9-11, 6-11 స్కోరుతో శరత్ - స్నేహిత్ ఓడిపోయారు.

17 ఏళ్ల వయసులో చెన్నైలోనే జరిగిన ఆసియా జూనియర్స్ టోర్నీతో తొలిసారి ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ బరిలోకి దిగిన శరత్ కమల్ రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. అసాధారణ రీతిలో 10 సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన శరత్ అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకున్నాడు.

కామన్వెల్త్ క్రీడల్లో 7 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు గెలిచిన అతను ఆసియా క్రీడల్లో 2 కాంస్యాలు సాధించాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో కూడా అతని ఖాతాలో 4 కాంస్యాలు ఉన్నాయి. 2004 నుంచి 2024 మధ్య ఐదు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న శరత్ కమల్‌ను భారత ప్రభుత్వం పద్మశ్రీ, ఖేల్‌రత్న పురస్కారాలతో గౌరవించింది.

## షేన్‌వార్న్ మరణం కేసులో కొత్తకోణం.. ఘటనా స్థలంలో 'ఆ ఔషధాలు'!



స్పోర్ట్స్ న్యూస్, 30 మార్చి (క్రాంతిన్యూస్ ): ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం షేన్ వార్న్ మరణం కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. థాయ్‌లాండ్‌లో ఓ విల్లాలో వార్న్ చనిపోగా.. అందుకు గుండెపోటు కారణమని భావించారు. దీనికి సంబంధించి తాజాగా ఓ కీలక విషయం తెరపైకి వచ్చింది. ఆ విల్లా నుంచి ఓ 'వస్తువు'ను తొలగించినట్లు బ్రిటన్ మీడియా సంస్థ డైలీ మెయిల్ సంచలన కథనం ప్రచురించింది. లైంగిక సామర్థ్యానికి సంబంధించిన ఓ ఔషధ బాటిల్ ఘటనా స్థలంలో లభ్యమైందని, దాన్ని అక్కడనుంచి తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించినట్లు తెలిసింది.

వార్న్ చనిపోయిన సమయంలో ఘటనా స్థలానికి వెళ్లిన ఓ సీనియర్ పోలీసు అధికారి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. "ఘటనా స్థలానికి వెళ్లగా.. అక్కడ ఓ ఔషధ బాటిల్‌తో పాటు వాంతులు, రక్తపు మరకలు కనిపించాయి. ఆ మాత్రలను అక్కడ నుంచి తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. మేం వాటిని మాత్రం తొలగించాం. అయితే, ఆ మాత్రలను వార్న్ ఎంత మోతాదులో తీసుకున్నాడనే విషయం తెలియదు. ఆ సమయంలో ఇది సున్నితమైన అంశం" అని పేర్కొన్నాడు. దీనిని 'కప్పిపుచ్చే' వ్యవహారంలో ఆస్ట్రేలియాకు చెందిన సీనియర్ అధికారుల పాత్ర ఉండవచ్చని అన్నాడు. వారి దేశానికి చెందిన ప్రముఖుడు ఈ స్థితిలో చనిపోయాడన్న విషయాన్ని బయటకు చెప్పకుండా ఉండేందుకు అలా చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు.

థాయ్‌లాండ్‌లోని కోహ్ సమూయి ద్వీపంలోని విల్లాలో షేన్‌వార్న్ 2022 మార్చి 4న హఠాన్మరణం చెందారు. ఆ వార్త ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను ఆవేదనకు గురిచేసింది. అయితే, షేన్‌వార్న్ తన విల్లాలో అచేతనంగా పడి ఉన్నారని, వైద్య బృందం ఎంతగా ప్రయత్నించినా ఆయన ప్రాణాలు కాపాడలేకపోయారని అతడి సిబ్బంది అప్పట్లో వెల్లడించారు. వార్న్ మరణానికి గుండెపోటు కారణమై ఉండొచ్చని భావిస్తున్నామని చెబుతూ.. వారి కుటుంబం గోప్యతను కోరుకుంటోందని చెప్పారు. అయితే, స్థానిక ఆసుపత్రి ఇచ్చిన పోస్టుమార్టం నివేదికలో మాత్రం వార్న్‌ది సహజ మరణమని, నేరపూరిత కోణం కనిపించలేదని పేర్కొంది.


## పొలిమేర బ్యూటీ చాలా బిజీ..
## ఎన్ని సినిమాల్లో నటిస్తుందో తెలుసా..?



పొలిమేర ఫ్రాంఛైజీతో నటిగా సూపర్ క్రేజ్ సంపాదించుకుంది హైదరాబాదీ భామ కామాక్షి భాస్కర్ల . విరూపాక్ష, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాలతో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ బ్యూటీ.. 'సైతాన్' వెబ్‌సిరీస్‌లో బోల్డ్ యాక్టింగ్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది.

గ్లామరస్ పాత్రలతోపాటు నటనకు ఆస్కారమున్న రోల్స్ చేసేందుకు రెడీ అంటోన్న ఈ భామ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. ఈ బ్యూటీ ఖాతాలో మూడు సినిమాలున్నాయి. వీటిలో ఒకటి అల్లరి నరేశ్‌తో కలిసి 12ఏ రైల్వే కాలనీ సినిమాలో నటిస్తోంది. ఈ మూవీ హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోంది.కాగా నవీన్ చంద్రతో కూడా సినిమా చేస్తుండగా.. ఇటీవలే సినిమా పూర్తయింది. కాగా ఈ బ్యూటీ మరోసారి ప్రేక్షకులను థ్రిల్ కలిగించే పొలిమేర మూడో పార్ట్‌లో కూడా నటిస్తోంది. ఈ మూవీ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది.
ఒకేసారి వరుస సినిమాలకు షూటింగ్ చేయడం కష్టమైనప్పటికీ, ఆ పని పట్ల ఉన్న మక్కువే నన్ను ముందుకు నడిపిస్తుంది. ఎందుకంటే సినిమా సెట్స్‌లో సమయం గడపడం ఎవరికి ఇష్టం ఉండదు.. అంటూ చెప్పుకొచ్చింది కామాక్షి భాస్కర్ల. నేను మూడు సినిమాల్లో నటిస్తున్నా.. మూడు కూడా విభిన్న పాత్రలే. ఛాలెంజింగ్‌గా అనిపించే పాత్రలను ఎంచుకోవడం, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి నటించే పాత్రలనే సెలెక్ట్ చేసుకుంటూ వస్తున్నా. ప్రతీ పాత్ర ఒక కొత్త ప్రయాణం.. అని నేను నమ్ముతానంటూ చెప్పుకొచ్చింది కామాక్షి భాస్కర్ల.

## ఫ్యాషన్ షోలో జాన్వీ కపూర్ ర్యాంప్ వాక్..



అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కుమార్తె జాన్వీ కపూర్ ఫ్యాషన్ షోలో అదరగొట్టింది. ముంబైలో జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్ 2025లో బ్లాక్ డ్రెస్‌లో అదరగొట్టింది ఈ భామ. ప్రసిద్ధ భారతీయ ఫ్యాషన్ డిజైనర్ రాహుల్ మిశ్రా కోసం జాన్వీ షోస్టాపర్‌గా వ్యవహరించింది. రాహుల్ రూపొందించిన వస్త్రాలను ధరించి అనేక మోడల్స్ వివిధ వేదికలపై ర్యాంప్ వాక్‌లో పాల్గొన్నారు. ఈసారి మొదటిసారిగా జాన్వీ కూడా రాహుల్ మిశ్రా డిజైన్ చేసిన దుస్తులతో లాక్మే ఫ్యాషన్ వీక్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది. నలుపు రంగు దుస్తుల్లో ర్యాంప్‌పై అడుగుపెట్టిన ఈ భామ. పొడవైన నల్లని కోటు కింద ఆకర్షణీయమైన బంధానీ బాడీకాన్ డ్రెస్‌ను ధరించి కనిపించింది. ర్యాంప్ మధ్యలో జాన్వీ తన కోటును తొలగించి అద్భుతమైన పోజులతో అలరించింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలు వైరల్‌గా మారాయి.

## సెకండ్ ఇన్నింగ్స్ అనే మాట
## మన ఒంటికి పట్టదు: బాలకృష్ణ

తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కొత్తదనం కోరుకుంటారని.. అందుకే 'ఆదిత్య 369'లాంటి చిత్రాన్ని అందించగలిగామని అగ్ర కథానాయకుడు బాలకృష్ణ అన్నారు. ఏప్రిల్ 4న ఈ మూవీ రీ-రిలీజ్ కానున్న సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు.





"ప్రతి సినిమాకీ వేరియేషన్స్ ఉండేలా అప్పట్లోనే చూసుకునేవాడిని. భారతీయ సినీ ఇండస్ట్రీలో ఒక కమర్షియల్ ట్రెండ్ సెట్ చేసి, నాకు స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి మా తండ్రి నందమూరి తారక రామారావు. ఏదో ఒక కొత్తదనం ఉండేలా పాత్రలు చేసేవారు. 'భైరవద్వీపం'లో కురూపి పాత్ర చేయడానికి ధైర్య సాహసాలు ఇచ్చింది ఆయనే. ప్రజలు ఎప్పుడూ కొత్తదనం కోరుకుంటారు. దాన్ని మనం ఆవిష్కరించాలి. ప్రేక్షకుల కోసం ఇంకా కొత్తగా ఏం చేయాలి? అన్న ఆత్మ పరిశీలన ఎప్పుడూ చేసుకోవాలి. నటన అంటే అరవడం, ఏడవటం, కామెడీ చేయటం మాత్రమే కాదు, పాత్ర తాలూకా ఆత్మను పట్టుకోవాలి. 'ఆదిత్య 369' కథ చెప్పినప్పుడు మరో ఆలోచన లేకుండా ఒప్పుకొన్నా. దీని వెనుక దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కృషి ఎంతో ఉంది. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాలకు పెట్టింది పేరు. కొత్త ఆలోచనలతో వచ్చిన దర్శక-నిర్మాతలను ప్రోత్సహించాలి. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని ఆదరిస్తారు.. అందుకే 'ఆదిత్య 369' వచ్చింది"
"నిర్మాత బాగుండాలని ఎన్టీఆర్ ఎప్పుడూ కోరుకునేవారు. నాన్నగారి సినిమాలు చూస్తూ పెరిగాను. ఇలాంటి పాత్రలన్నీ నాకు కొట్టిన పిండి. నేను రెండు జనరేషన్స్‌కు కనెక్ట్ అయ్యా. అటు సినిమాలు, ఇటు 'అన్‌స్టాపబుల్' వంటి కార్యక్రమాలు చేశాను. నా కొడుకే కాదు, నా మనవడికీ కనెక్ట్ అయ్యాను. అన్ని వర్గాలను అలరించేలా సినిమాలు చేస్తున్నా. పద్మభూషణ్ ఆలస్యంగా వచ్చిందని చాలా మంది అంటారు. కానీ, సరైన సమయానికే వచ్చింది. ఇండస్ట్రీలో సెకండ్ ఇన్నింగ్స్ అనే మాట వినపడుతుంది. ఆ పదం మన ఒంటికి పట్టదు. విజయవంతమైన చిత్రాలు ఇచ్చాను.. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా.. ఓటీటీలో వేదికగా కార్యక్రమాలు చేశాను.. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గానూ ఉన్నాను.. 'ఆదిత్య 369'లా మూవీ చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కొన్ని మొదలు పెట్టకుండానే ఆగిపోయాయి. మరికొన్ని ఈ స్థాయి విజయం అందుకోలేదు. చలనచిత్ర పరిశ్రమలో కొన్ని గొప్ప సినిమాలు పేర్లు చెప్పమంటే, 'మాయబజార్', 'సీతారామ కల్యాణం', 'శ్రీకృష్ణ పాండవీయం' లాంటి చిత్రాలు చెబుతారు. ఇది కూడా ఆ కోవలోకి వస్తుంది. దీని సీక్వెల్ కూడా రెడీ అయింది. మొదలు పెడితే, ఆపేది లేదు" అని బాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, బాబూ మోహన్, దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## 13 ఏళ్ల తర్వాత దర్శకత్వం: కొత్తవారికి తనికెళ్ల భరణి ఆహ్వానం

దాదాపు 13 ఏళ్ల తర్వాత ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి మెగాఫోన్ పట్టనున్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఆ వివరాలు ప్రకటించారు. తాను దర్శకత్వం వహించనున్న సినిమాలోని హీరో, హీరోయిన్ల కోసం కొత్త ప్రతిభను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. తన సినిమా కథ మేరకు 20 నుంచి 25 మధ్య వయసున్న 8 మందిని ఎంపిక చేస్తానన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను



ంఱఋుంబుఎఙ్బుఘఅఘుఎ.23 ఏస్టఘఱఙ్ఆఞ్ఞ.షిఏఓకు మెయిల్‌గానీ, 8897496143, 9701522123 వాట్సాప్ నంబర్లకుగానీ పంపమని కోరారు.

ఎన్నో చిత్రాల్లో వైవిధ్య పాత్రలు పోషించిన తనికెళ్ల భరణిలో మంచి రచయిత కూడా ఉన్నారనే సంగతి తెలిసిందే. 'సిరా' (షార్ట్‌ఫిల్మ్), 'మిథునం'తో దర్శకుడిగానూ మంచి గుర్తింపు పొందారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మి ప్రధాన పాత్రల్లో రూపొందిన డ్రామా మూవీ 'మిథునం' ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. బెస్ట్ డైలాగ్ రైటర్ (తనికెళ్ల భరణి) సహా నాలుగు నంది అవార్డులు అందుకుంది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com